క్లుప్తంగా

తుప్పల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్



తుప్పలు తొలగిస్తున్న కార్మికుడు

మెరకముడిదాం: మండలంలోని బుధరాయవలస నుంచి సోమలింగాపురం వెళ్లే ప్రధాన రహదారిని ఆనుకుని బుధరాయవలస జీడిపప్పు పరిశ్రమ వద్ద ఉన్న ఓ విద్యుత్ స్తంభానికి పిచ్చి మొక్కలు, తీగలు అల్లుకున్నాయి. దీంతో సాక్షి పత్రికలో 'అల్లుకున్న నిర్లక్ష్యం' శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీడీఓ జి.భాస్కరరావు స్పందిస్తూ విద్యుత్ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి వెంటనే తుప్పలను తొలగించారు.

వినూత్న నిరసన



నిరసన తెలియజేస్తున్న ఉపాధి వేతనదారులు

కొత్తవలస: తొమ్మిది వారాలుగా కూలి డబ్బులు ఇవ్వకపోతే గడ్డి తిని బతకాల అని ఉపాధి వేతనదారులు ప్రశ్నించారు. ఈ మేరకు మండలంలోని కొత్త సుంకరపాలెంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు గాడి అప్పారావు నేతృత్వంలో శుక్రవారం వినూత్న రీతిలో నిరసన తెలియజేశారు. చేతిలో గడ్డి, ఆకులు పట్టుకుని తమ గోడు వెల్లబోసుకున్నారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ



విద్యామిత్ర కిట్లతో కూడిన వ్యాన్ వద్ద అధికారులు

గజపతినగరం రూరల్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యామిత్ర కిట్లను శుక్రవారం పంపిణీ చేసినట్లు ఎంఈఓ విమలమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల నుంచి అన్ని పాఠశాలల విద్యార్థులకు కిట్లు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ - 2 బి.సాయిచక్రధర్‌తో పాటు పలువురు సీఆర్పీలు పాల్గొన్నారు

ఆర్థికసాయం..



చిరంజీవి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న తోటి స్నేహితులు

గుర్ల: మండలంలోని గోషాడకు చెందిన టొంపల చిరంజీవి పది రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడితో కలిసి కలవచర్ల హైస్కూల్‌లో 2002లో పదో తరగతి చదువుకున్న తోటి స్నేహితులు రూ. 30 వేలు సేకరించి బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో బి. కూర్మారావు, రేణుక వర్ధన్, లలితకుమారి, పతివాడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను సందర్శించిన జడ్జి



హాస్టల్‌ను పరిశీలిస్తున్న జడ్జి విజయచంద్ర

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను కొత్తవలస కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్. విజయచంద్ర శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో జరుగుతున్న మరమ్మతులను పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభించే సమయానికి పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులతో పాటు హాస్టల్ వార్డెన్ కొల్లు గౌరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగంతో అనారోగ్యం

గుర్ల: ప్లాస్టిక్ వినియోగించడం వల్ల క్యాన్సర్, ఇతర రోగాలు వస్తాయని ఈఓపీఆర్‌డీ అన్నపూర్ణాదేవి అన్నారు. ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలలో నిల్వచేసిన పదార్థాలు తినడం వల్ల కలిగే అనర్థాలపై పంచాయతీ కార్యదర్శులతో కలిసి మండల కేంద్రంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ప్లాస్టిక్ రహిత సమాజంగా తీర్చిదిద్దాలని, సింగల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని ప్రజలకు సూచించారు. అవగాహన ర్యాలీలో స్వచ్ఛభారత్ మండల కోర్డినేటర్ జమ్ము శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతులకు అన్నదాత సుఖీభవ..

కొత్తవలస: కౌలు పత్రాలు పొందిన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయనున్నట్లు వ్యవసాయశాఖ ఏడీఏ ఎల్.విజయ తెలిపారు. మండలంలోని చీపురవలస గ్రామంలో శుక్రవారం నిర్వహించిన కౌలురైతుల గుర్తింపు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కౌలుకు తీసుకుని భూములు సాగు చేస్తున్న ప్రతి రైతూ కౌలు పత్రాలు పొందాలన్నారు. కార్యక్రమంలో ఏఓ మాధురీశరణ్య, మహిళా రైతులు పాల్గొన్నారు.

నాడు కళకళ.. నేడు వెలవెల

- విద్యారంగంపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు
- అర్ధంతరంగా నిలిచిన నాడు –నేడు పనులు
- మరో పన్నెండు రోజుల్లో తెరుచుకోనున్న పాఠశాలలు
- పూర్తి కాని అభివృద్ధి పనులు



గరివిడి మండలంలోని అప్పన్నవలస పాఠశాలలో ముందుకు కదలని నేడు - నేడు నిర్మాణాలు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): భవిష్యత్‌లో ఉన్నత స్థానాలు అధిరోహించాలంటే ప్రాథమిక విద్యాభ్యాసం బలంగా ఉండాలి. ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్య అందాలన్నా, పిల్లలు మంచిగా చదువుకోవాలన్నా అందుకు తగ్గట్టుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి. విద్యార్థులు చదువుకునేందుకు అనువుగా ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పిస్తే విద్యార్థుల నుంచి ఆశించిన ఫలితాలు వస్తాయి. విద్యారంగాన్ని బలోపేతం చేస్తే సమాజం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో నాటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'నాడు – నేడు మనబడి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించింది. అయితే కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి విద్యారంగం నీరుగారిపోతోంది. ఎటువంటి అభివృద్ధి పనులు జరగడం లేదు. నాడు – నేడు కార్యక్రమాన్ని పూర్తిగా పక్కనబెట్టసింది. దీంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గతంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎన్నడూ లేనివిధంగా, ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వేల కోట్ల రూపాయలతో పాఠశాలలను అభివృద్ధి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయలను కల్పించాలనే ఆలోచనతో నాడు – నేడు కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా ప్రత్యేక నిధులతో పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేశారు. బెంచీలు, తాగునీటి సదుపాయం, మరుగుదొడ్లు, అదనపు భవనాలు, తదితర అన్ని హంగులు కల్పించిప కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేశారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యే సమయానికి విద్యార్థులకు పుస్తకాలతో పాటు యూనిఫారాలు, బూట్లు, సాక్సులు పంపిణీ చేశారు.



గుర్ల మండలంలోని కొండగండ్రేడు హైస్కూల్‌లో అసంపూర్తిగా మిగిలిపోయిన నాడు - నేడు భవనాలు

నేడు ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా విద్యాభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత ప్రభుత్వంలో నాడు – నేడు కార్యక్రమంలో జరుగుతున్న పనులు ఏడాది కాలంగా అసంపూర్తిగా ఉండడమే కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనం. నాడు – నేడు పనులు ముందుకు సాగకపోవడంతో నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లోని పాఠశాలల్లో మౌలిక వసతుల సమస్య స్పష్టంగా కనిపిస్తోంది. జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభంకానున్నాయి. అయితే ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులకు సమస్యలు ఆహ్వానం పలకనున్నాయి.



మెరకముడిదాం మండలం బైరిపురం ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాలు

నాడు ఎంతో అభివృద్ధి..

నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా చీపురుపల్లి మండలంలో మొదట, రెండో విడతలో 37 పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి చేశారు. వీటిలో 23 పాఠశాలల్లో పనులు పూర్తి చేయగా 14 పాఠశాలల్లో పనులు అసంపూర్తిగా మిగిలి ఉన్నాయి. గరివిడి మండలంలో మొదట విడతలో 31 పాఠశాలలు, రెండో విడతలో 19 పాఠశాలలను ఎంపిక చేశారు. మొదట విడతలో పూర్తి స్థాయిలో పనులు పూర్తవ్వగా.. రెండో విడతలో 2 పాఠశాలల్లో అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. గుర్ల మండలంలో తొలి విడతలో 39 పాఠశాలలు, రెండో విడతలో 23 పాఠశాలను ఎంపిక చేసి పనులు చేపట్టగా.. మొత్తంగా 48 పాఠశాలల్లో పనులు పూర్తవ్వగా 14 పాఠశాలల్లో పనులు పూర్తికాలేదు. మెరకముడిదాం మండలంలో 21 పాఠశాలల్లో నాడు – నేడు పనులు చేయగా 9 పాఠశాలల్లో పనులు పూర్తవ్వగా 12 పాఠశాలల్లో అసంపూర్తిగా మిగిలిఉన్నాయి.

తప్పని అవస్థలు..



కె. కృష్ణాపురం ఉన్నత పాఠశాలలో మధ్యలో నిలిచిన అదనపు తరగతి గదులు

దత్తిరాజేరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చింది. నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను అభివృద్ధి చేశారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారు. అయితే కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించాక ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవగా.. నాడు – నేడు పనులను అర్ధంతరంగా నిలిపివేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దత్తిరాజేరు మండలం కె. కృష్ణాపురం ఉన్నత పాఠశాలలో ఆరు అదనపు తరగతి గదుల నిర్మాణానికి గత ప్రభుత్వం సుమారు రూ. 40 లక్షల నాడు – నేడు నిధులు కేటాయించగా పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. అయితే ఆ పనులను పూర్తి చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. అలాగే మండల కేంద్రమైన దత్తిరాజేరు కేజీబీవీలో సర్వశిక్షాభియాన్ నిధులతో నిర్మిస్తున్న అదనపు తరగతి గది నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. రెండు తరగతి గదులను కూడా పూర్తి చేయని కూటమి ప్రభుత్వం తీరును పలువురు నిరసిస్తున్నారు. బొండపల్లి మండల బోడసింగిపేట ప్రాథమిక పాఠశాలకు పనులు పూర్తయినట్లు అధికారులు పైపైన మెరుగులు దిద్దారు. గంట్యాడ, గజపతినగరం మండలాల్లో కూడా ఎన్నో పాఠశాలల్లో నాడు – నేడు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి.



దత్తిరాజేరు కేజీబీవీలో ఎస్ఎస్ఏ నిధులతో నత్తనడకన సాగుతున్న పనులు



కేజీబీవీలో పూర్తి చేయని 'నాడు -నేడు' పనులు



బొండపల్లి మండలం బోడసింగిపేట పాఠశాలలో పాత భవనాలకు వేసిన రంగులు

సర్కారు బడులకు సెగ...

- కూటమి సర్కారు నిర్వాకం

శృంగవరపుకోట/వేపాడ: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి నిన్నటి వరకు సర్కారు బడులను పట్టీపట్టనట్లు వదిలేసిన ప్రభుత్వాలకు భిన్నంగా సర్కారు బడులను భవిష్యత్ ప్రయోగశాలలుగా తీర్చిదిద్దిన ఘనత ఒక్క జగన్ సర్కారుకే దక్కింది. గత ప్రభుత్వ హయంలో మంజూరు చేసి, చేపట్టిన పనులను ఇప్పటికి కూడా కూటమి సర్కారు పూర్తి చేయలేదు. పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న తరుణంలో సర్కారు గాలికొదిలేసిన సర్కారు స్కూళ్లపై ''సాక్షి' ఫోకస్. ఎస్.కోట మండలంలో తొలివిడతగా నాడు – నేడు ఫేజ్–1 కార్యక్రమంలో భాగంగా 27 స్కూళ్లలో మరమ్మతులు, అదనపు భవనాలు, ఎలక్ట్రిఫికేషన్, టాయిలెట్స్, రన్నింగ్‌వాటర్, బోర్డులు, ఫర్నీచర్, ఇలా అన్ని సౌకర్యాల కోసం రూ.557.62 లక్షలు కేటాయించారు. తొలివిడత శతశాతం పనులు పూర్తి చేసి సర్కారు బడులకు కొత్త వెలుగు తెచ్చింది జగన్ సర్కారు. ఇదే క్రమంలో నాడు – నేడు ఫేజ్–2లో 131 పనుల కోసం రూ.442.18 లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో పలు అభివృద్ధి పనులు చేపడుతుండగా.. ప్రభుత్వం మారి కూటమి సర్కారు అధికారంలోకి వచ్చింది. అయితే కొత్త ప్రభుత్వం అభివృద్ధి పనులను పూర్తి చేయకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి.



సీతంపేటలో అర్ధంతరంగా నిలిచిపోయిన స్కూల్ భవనం



వేపాడలో కస్తూరీబా గాంధీ బాలికల పాఠశాలపై అసంపూర్తిగా నిలిచిపోయిన భవనం

వేపాడలో..

నాడు – నేడు పథకం మొదటి విడతలో 26 పాఠశాలల్లో రూ. 554.24 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఈ నిధులతో పాఠశాలల్లో తాగునీరు, రన్నింగ్ వాటర్ సదుపాయం, మరుగుదొడ్లు, గ్రీన్‌బోర్డులు, ఫర్నీచర్, అదనపు భవనాలు, తదితర సౌకర్యాలు కల్పించారు. అలాగే రెండో విడతలో 16 పాఠశాలలకు రూ. 3.96 కోట్లు.. ఎనిమిది అంగన్‌వాడీ భవనాల మరమ్మతులు, ఫర్నీచర్, తదితర కనీస సౌకర్యాలకు రూ. 30 లక్షలు మంజూరు అయ్యాయి. అయితే ఈ నిధులతో చేపట్టాల్సిన పనులు నేటికీ పూర్తి చేయలేదు. అలాగే వేపాడ కస్తూరీబా గాంధీ పాఠశాలకు సంబంధించి మేడపైన అదనపు భవనాలు పిల్లర్ల స్థాయిలో నిలిచిపోయాయి. దుంగాడ ప్రాథమిక పాఠశాల పనులు చివరి స్థాయిలో ఉండగా.. వావిలపాడు, నీలకంఠరాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కృష్ణప్రసాద్

గంట్యాడ: నాణ్యతా ప్రమాణాలతో వసతిగృహ భవనాల పనులు చేపట్టాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎ. కృష్ణప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ వసతిగృహన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహంలో చేపడుతున్న మరమ్మతులను పరిశీలించారు. అనంతరం బీసీ సంక్షేమ వసతిగృహాన్ని పరిశీలించారు. వసతిగృహంలో ఎంతమంది చదువుతున్నదీ రికార్డులను పరిశీలించి ఆరా తీశారు. కార్యక్రమంలో వార్డెన్లు సన్యాసిరావు, సీతారామశర్మ పాల్గొన్నారు.



ఎస్సీ సంక్షేమ వసతిగృహంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సివిల్ జడ్జి డాక్టర్ కృష్ణ ప్రసాద్

కార్మికవర్గాలకు అండగా సీఐటీయూ

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌరినాయుడు

చీపురుపల్లి రూరల్ (గరివిడి): కార్మికవర్గాలకు ఎలాంటి సమస్య ఎదురైనా వారి పక్షాన పోరాడుతూ సీఐటీయూ అండగా నిలబడుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబళ్ల గౌరినాయుడు అన్నారు. గరివిడిలోని ప్రజాసంఘాల కార్యాలయంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూనియన్ జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1970 మే 30న సీఐటీయూ ఉద్భవించిందన్నారు. అప్పటివరకు ఉన్న యూనియన్లు కార్మికవర్గ ప్రయోజనాలను నెరవేర్చడంలో విఫలమయ్యాయని తెలిపారు. సీఐటీయూ మాత్రం కార్మికుల పక్షాన నిలబడి ఎన్నో సమస్యలను పరిష్కరించిందని చెప్పారు. కార్యక్రమంలో జె.విశ్వనాథరాజు, ఓఎస్ఎన్ మూర్తి, ముఖేష్‌సింగ్, పిసిని అప్పలనాయుడు, పాపినాయుడు, రమణ, సత్యం, సాంబ, తదితరులు పాల్గొన్నారు.



గరివిడి సీఐటీయూ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

గేటుకు బేడీలు తొలగించిన పోలీసులు

సాక్షి ఎఫెక్ట్

కొత్తవలస: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఓ గేటుకు బేడీలు వేసిన వైనంపై సాక్షి పత్రికలో ' గేటుకు బేడీలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు గేటుకు వేసిన బేడీలను శుక్రవారం తొలగించారు. ఈ విషయంలో సిబ్బందికి కూడా చార్జ్‌మెమోలు జారీ చేసినట్లు సమాచారం.



గేటుకు గల బేడీలను తొలిగించిన దృశ్యం

అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్:

గజపతినగరం: అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు రాష్ట్ర చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలనా శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి వేతనదారులకు వేతనాలు సకాలంలో అందుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. పామాయిల్, డ్రాగన్ ఫ్రూట్స్, తదితర పంటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని చెప్పారు. డ్రాగన్ ఫ్రూట్స్ సాగు చేస్తే హెక్టార్‌కు ప్రభుత్వం 2.75 లక్షల ప్రోత్సాహం అందిస్తుందని, మార్కెటింగ్ సదుపాయం కూడా ప్రభుత్వం కల్పిస్తుందని తెలిపారు. పామాయిల్ పండించే రైతులకు 90 శాతం రాయితీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందిస్తున్నట్లు చెప్పారు. గజపతినగరం మండలానికి 17 కోట్ల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరయ్యాయని.. ఇందులో ఆరున్నర కోట్ల రూపాయలతో పనులు పూర్తయ్యాయన్నారు. ఇరిగేషన్‌కు సంబంధించి మండలంలో ఎంఎన్ చానల్, బీవీ చానల్‌లో కొంత భాగం పనులు చేపట్టేందుకు 50 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం గజపతినగరం మండలం లోగిశ గ్రామంలో ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రమీల గాంధీ, ఎంపీడీఓ బి.కల్యాణి, తహసీల్దార్ బి.రత్నకుమార్‌లతో పాటు ఐసీడీఎస్, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖాధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

వాహన తనిఖీలు

దత్తిరాజేరు: మండలంలోని ఎస్. భూర్జవలస పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేసిన వారికి, పత్రాలు లేనివారికి అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

వీఆర్‌ఓపై విచారణ

బొండపల్లి: మండలంలోని కనిమెరక వీఆర్‌ఓగా పని చేస్తున్న బోని ప్రసాదరావు గతంలో ఒంపల్లి వీఆర్‌ఓగా పని చేశారు. ఈ సమయంలో రైతుల నుంచి అక్రమంగా డబ్బులు తీసుకున్నారనే ఫిర్యా మేరకు తహసీల్దార్ డోల రాజేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. పట్టాదారు పాస్ పుస్తకాలు ఆన్‌లైన్ చేసేందుకు, మ్యుటేషన్, తదితర పనులు చేసేందుకు ఎనిమిది మంది రైతుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ ఆదేశాల మేరకు తహసీల్దార్ విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు.

నేడు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంలో గల సత్య ఫంక్షన్ హాల్‌లో శనివారం సాయంత్రం మూడున్నర గంటలకు వైఎస్సార్‌సీపీ గజపతినగరం నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ చల్లా చలంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు చల్లా చలంనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొత్స అప్పలనరసయ్య హాజరుకానున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండంలోని అన్ని గ్రామాలకు చెందిన ముఖ్య నాయకులు హాజరుకావాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం ఎస్సీ కాలనీలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఈ మేరకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మహిళలు ఖాళీ బిందెలతో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో డైరెక్ట్ పంపింగ్ పథకం ఉన్నప్పటికీ, పలువురు మోటార్ల ద్వారా నీటిని తోడేస్తుండడంతో శివారు కాలనీలకు తాగునీరు సరఫరా కావడం లేదని వాపోయారు. తాగునీటి సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవ్వరూ పట్టించుకోలేదని సర్పంచ్ గొటివాడ దేవి తెలిపారు. ఇప్పటికైన సంబంధిత శాఖాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్‌తో పాటు మహిళలు కోరారు. ఈ విషయమై ఎంపీడీఓ సూర్యనారాయణ వద్ద ప్రస్తావించగా.. పరిష్కారానికి త్వరలోనే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముంచెత్తిన వాన



మేజర్ పంచాయతీ శృంగవరపుకోటలో శుక్రవారం సాయంత్రం వాన ముంచెత్తింది. ఎడతెరిపి లేకుండా కుంభవృష్టిగా కురిసిన వాన ధాటికి పట్టణం తడిసి ముద్దయ్యింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆక్రమణలతో కుంచించుకుపోయిన విశాఖ - అరుకు హైవే చెరువును తలపించింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ప్రతిసారీ ఇదే సమస్య తలెత్తుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. - శృంగవరపుకోట